



ఒకేసారి మూడుత్తరాలు !

ఒకటి మావయ్య దగ్గిరనుంచి.

అక్కయ్య వ్రాసి ది రెండు -

మరోటి అన్నయ్యది !

మావయ్య మొదటికూతురు సావిత్రి కంట్లో పువ్వు పడిందన్న వార్త; బావ ఈమధ్య తాగుడు మాని మామూలు మనిషయ్యాడని అక్కయ్య వ్రాసిన ఉత్తరం; క్రికేట్ మాచ్‌లో మోచేయి బ్రద్దలయిం




దని అన్నయ్య వ్రాతలూ – అన్నీ నాన్న గారిని ఉక్కిరిబిక్కిరి చేశాయి.

మావయ్య ఉత్తరం అమ్మ కండ్లలో అర్థంకాని కన్నీరుగా మెరిసింది.

నాన్న పెదవులమీద ముసలినవ్వుగా– బామ్మ కంఠంలో ఓరగా వ్యాకులతగా– యింకెన్నో రకాలుగా!

కాని పార్వతి నాకు వ్రాసిన ఉత్తరం వాళ్ళ నెటువంటి ఆవేశాలకు గురిచేయ లేదు.

పార్వతి ఉత్తరం వ్రాసింది.

నేను ఊహించని ఉత్తరం వచ్చింది– నేను సదా ఊహించుకునే పార్వతి దగ్గరి నుంచి–

"ఇది అన్యాయం...కాని ఎదిరించ లేని అసహాయత... ఆడదాన్నికదూ! విషం తాగి ఆత్మహత్య చేసుకునేంత ధైర్యం లేదు. అది పాపం! అంతకు తప్పితే ఏమీ తెలియదు నాకు. నిన్ను నిరాశ కలిగిస్తున్నందుకు క్షమించు. నా పెండ్లి... అంతే! మళ్ళీ ఎప్పుడైనా కనిపిస్తాను – బ్రతికుంటే!"

ఎన్నిసార్లు చదువుకున్నానో ఆ ఉత్తరం? మళ్ళీ మళ్ళీ చదవా లనిపిస్తున్నా అందులోని నిజం నన్ను దహిస్తూంది.

పార్వతి పాత్రా, నా పాత్రా 'జీవితం' అనే నవలలోని పాత్రలయితే, పార్వతిని కలుసుకుంది నాలుగు అధ్యాయాల్లో మాత్రమేనని చెప్పాలి.

మొదటి మెట్టు బాల్యం!

కలిసి ఆడుకున్నాం, కలిసి చదువు కున్నాం. ఆ సంవత్సరాలన్నీ కలిపి కూడితే పధ్నాలుగేండ్లలోనే– పార్వతిని

'పారూ' అని పిలవడం నేర్చుకున్నాను. అదొక పగటి కల. నవలలోని మొదటి ముఖ్యమయిన అధ్యాయం ఆ విధంగా ప్రారంభమై ఫలితం లేకుండానే ముగిసింది.

ఏనాటికైనా మళ్ళీ కనిపిస్తుందనే ఆశ_ ఒకసారి నిజమయింది. కండ్లను నులుపుకోక పోయినా ఆశ్చర్యంగా చూశాను. ఎదురుగ్గా పార్వతి—

నవ్వే కండ్లతో...

అవ్యక్తభావాలతో సతమతమైపోతూ ఏదో చెప్పాలని తారట్లాడే పెదాలతో... పార్వతి బస్సులో కనిపించింది.

బయట వర్షం!

బస్సులోపల చిరునవ్వుల వాన.

ఆత్మీయతను ఒలకరించే చూపులు - నాకూ పార్వతికీ మధ్యవున్న దూరాన్ని పరుగెత్తేబస్సు దగ్గిరికి చేరుస్తుందేమోనని ఆశపడ్డాను. కాని అలా జరగలేదు. ప్రతీది అనుకోవడమే సరిపోతుంది.

మరింతపరికించి చూశాయి నా కండ్లు.

సిగ్గు ఆమె తలను వంచేసింది.

వాలినకండ్లు సిగ్గుతో క్రుంగుతున్నాయో, బాధతో కురుస్తున్నాయో తెలియదు. మెడలో మెరిసే మాంగల్యం, గుండ్రటి నయాపైసంత తిలకపు బొట్టూ, చేతులునిండా గాజులు, ఏదో పరిపూర్ణత కనిపించింది ఆమె అంగసౌష్టవంలో.

పార్వతి పెండ్లి చేసుకుంది.

ఎవరినో కాని, తనకన్నా గొప్పవాడే కావచ్చు. తను సాధించలేనిది అతనెవరో సాధించాడు.

నాలోని బలహీనత తప్ప పార్వతి దూరం కావడానికి మరో ముఖ్య కారణము కనిపించలేదు.

ఆమె నా వైపు చూస్తోంది.

కండ్లడిగాయి - నా పెదవులు వణికాయి.

ఆమె అడిగింది — నేను సమాధానమివ్వలేని విధంగా.

"ఏం చేస్తున్నావు_?" అన్నట్లుగా చూసింది.


"నేనో బడిపంతుల్ని... చేతకానివాడిని. ఇతరులకు భుక్తిమార్గం చూపుతున్నా ననే తృప్తితో నా జీవితాన్ని యీదుతున్న ధీశాలిని..." యివన్నీ పార్వతికి ఎలా చెప్పాలి?"

ఆమె కండ్లు నా ప్రక్కన ఖాళీగా వున్న సీటువైపు చూశాయి 'నీ భార్యా బిడ్డలు—' అన్నట్లు.

"అంత అదృష్టంకూడానా పార్వతీ! నా గుండెల్లో యింకా మాయనిగాయాలు సదా నన్ను రక్కుతుంటే, ఆ బాధను వేరేవాళ్ళకెలా పంచిఇవ్వగలుగుతాను? యింకో జీవితాన్ని నాశనం చేయలేను."

ఆమెకు అర్థంకాదు. నా సమాధానాలు ఆమె కర్ణపుటాలను చేరుకోవు. మధ్యలో ఒక అగాధముంది - చూస్తూ బ్రతికుండటానికి.

"తొందర పడ్డావు పార్వతీ_?"



నేనలా వూరెళ్లడం భయం-
వున్నదికాస్తా మీరిలా పేకాట ఆడేస్తే ఎలాగండీ మరి—

"తొందరకాదు గోపీ. ఆలస్యంగానైనా నిన్ను మరింత దగ్గరికి చేసుకోలేక పోయానని తపిస్తున్నాను. హృదయాన్ని తెలియజేయలేనివాడివి – నిన్ను వేరేవాళ్ళకు అప్పగించాను. నీ ముందు నే నెట్లా బయటపడి వుండాల్సింది ?"

"అవును పార్వతీ ! పొరపాటు నాదే. కాని దాన్ని యిప్పు డెలా సరిదిద్దుకోను–?"

బయట కురిసే వర్షం !

పార్వతి కండ్లల్లో ఇతరులకు కనిపించని మేఘాలు...

నా హృదయంలో ఎవరికీ అర్థంకాని బాధ...

న న్నోచోట బస్సు విసిరేసింది – విధికన్నా కొంత నాజూకుగా !

చినుకుల్లో తడుస్తూ యింటి కెళ్ళాను.

ఎప్పుడూ అదేపనిగా ఆలోచిస్తూంటే కలలోకూడా అదే వస్తుందంటారు. మరి నా కలల్లో పార్వతి కనిపించదేం ? ఇలా మరో అధ్యాయం ముగిసింది. నవలలో దీనికంత ప్రాధాన్యత యివ్వబడదు. చిన్నచిన్న సంఘటనలలో యిదోరకం. కాని నేనెలా మరచిపోగలుగుతాను–?

మూడోసారి రైల్లో–!

మొదటికంటే కొంచెం లావుగా వుంది. బాగా రంగొచ్చింది. ముఖంలో కాంతి, కాటుకకంటే మెరిసే కండ్లు. గుంటూర్ వెడుతున్నప్పుడు – మా ఆవిడకు మూడో కాన్పు.

నన్ను చూసి ఆనందంతో కండ్లు మూసుకుంది పార్వతి.

జాలితో, అభిమానంతో ఆమెను చూసి ప్రసన్నుడ నయ్యాను. ఆ ఆనందములో సంతృప్తి చిహ్నాలు స్పష్టంగా కనిపించాయి. ప్రక్కనే నిద్రపోతున్న చిన్నారి పాప ... పాపలాగే స్వచ్ఛమైన హృదయంతో పార్వతి. ఆమె

భర్తకాబోలు బెర్తుమీద అటూఇటూ కదులుతూ నిద్రపోవడానికి ప్రయత్ని స్తున్నాడు.

ఈసారి పార్వతి ని సులభంగానే గుర్తుపట్టాను.

ఆమె నా వైపు విచిత్రంగా చూసింది. కండ్లజోడొకటి తగిలి యేడ్చిందాయె యీమధ్య నాకు.

ఆమె కండ్లక్రింది ముడుతలు పుందాతనాన్ని తెలుపుతున్నాయి. అమాయకంగా నిద్రపోతున్న పాపవైపు ఒకసారి చూసి నవ్వింది.

"ఎన్నాళ్ళకు కనిపించావు గోపీ ?"

కండ్లజోడు వెనకాల కండ్లు తడిశాయి.

"నీకు పిల్లలా ? ఎంతమంది ? నా సంసార యాత్ర ఎంతో సుఖప్రదంగా వుంది."

నా భావాలు ఆమెకు ఎలా చెప్పుకోవాలి ? ప్రశ్నలు కురిపిస్తున్నాయి ఆమె నయనాలు.

"పైన పడుకున్నవారు మా వారు — చాలా మంచివారు — లేచింతరువాత పరిచయం చేసుకో."

అలాగే నన్నట్లు చూశాను.

"అన్నట్లు — ఎక్కడికి కెళ్తున్నావు గోపీ ? మాట్లాడవేం ? ఇంకా మొదటి లానే వున్నావా—?"

తల వంచుకున్నాను.

ఆమె ప్రశ్న లన్నింటికీ అగ్నిశిఖల్లా పైకి లేచే సమాధానా లున్నాయి. చెప్పుకోలేని బలహీనత నన్ను వెంటాడుతూంది — అప్పటికీ ఇప్పటికీ !

"మాట్లాడలేక నే నొంటరివాడి నయ్యాను. మళ్ళీ మాట్లాడి ఏమైపోతానో పార్వతీ ! నాకు పిల్లలున్నారు; పెద్ద వాడికి నా పోలిక. రెండవ వాడు వాడమ్మలా వుంటాడు. భగవంతుడు వాడిని అలా వుండనివ్వలేదు. ఒక కాలు విరగ్గొట్టి ఊరుకున్నాడు. నాకు చత్వార మొచ్చింది. మతిమరుపు కొంచెం జాస్తి అయిందంటున్నారు. మాట్లాడవేమని అడుగుతావు ? మాట్లాడితే ఏం మాట లొస్తాయో.నని భయం —"

"అసలు చేతకాదు. నోట్లో నాలుక లేనివాళ్ళే బడిపంతు ళ్ళౌతారు."

రైలు కదుపు లిస్తూంది. పైన ఆయ నెవరో సుఖంగా నిద్రపోతున్నాడు.

నా మనసులో మెదులుతున్న సమాధానాలు ఆమె కెలా తెలియజేయాలి ?

ఆమెను 'పారూ' అని పిలవాలి.

"పారూ !"


ఇప్పుడు పార్వతీదేవి — ఉత్తమ ఇల్లాలు. ఆమెనుగురించి మరోలా ఆలోచించకూడదు. ఆమెపాపను దీవించాలి. చేతనైతే వంగి ముద్దాడాలి.

రైలు దిగాల్సివచ్చింది.

"ఎప్పుడూ మధ్యలో ఆగిపోవడం నా జీవితంలోనే ఉందేమో !"

పార్వతికండ్లు నావైపు చూస్తున్నాయి.

'ఉంటాను — గోపీ" అన్నట్టున్నై.




కండ్లజోడు సవరించుకున్నాను; నేనేమీ అనలేదు; ఏమైనా పార్వతి అనాల్సిందే.

రైలు కదిలింది. కాని నా పెదిములు కదలలేదు. నా కాళ్ళు ముందుకు నడిచాయి. పార్వతి నా దృష్టిపథంలోంచి యింకా కదల్లేదు.

నాల్గో మైలురాయి దాటేటప్పటికి పూర్తిగా అలసిపోయాను. అప్పటికే ఓ నాలుగు పదులు దాటింది వయస్సు.

ఈ నాలుగు మైలురాళ్ళు నా నిత్య జీవితంతోపాటు కలసిపోయాయి. ఇంకా నాకు స్పష్టంకాని విషయాలు ఎన్నో వున్నా, వయసు నన్ను వాటికి దూరంగా తీసుకుపోతూంది. ఇలాంటి పరిస్థితులను అర్థంచేసుకోవాలనే ప్రయత్నంతో ఒకనాడు వరండాలో కూర్చొనున్నాను.

. జారిపోతున్న లాగూను పైకి లాక్కుంటూ పరుగెత్తుకొచ్చాడు రాజు. వీడు మూడోవాడు.

"ఎక్కడికి కెళ్ళావురా?' అనడిగా.

లోపలికి పోతున్నవాడల్లా గడపమీద కాలుపెట్టి వెనక్కితిరిగి భయపడ్తూ జవాబిచ్చాడు.

"ఆడుకోవడానికి."

"ఎవరితో ?"

వాడి కిలాంటి ప్రశ్నొకటి వస్తుందని ముందే తెలుసు. తెలిసినా మొదట దీనికి సమాధాన మివ్వడు. ఒక్కొకటే అడగాలి.

గేటుదగ్గర నిల్చున్న అమ్మాయి వైపు చూశాడు.

"ఎవరమ్మాయిరా ?"

"చక్రపాణిగారి అమ్మాయి."

"ఏ చక్రపాణి... కర్ణంగారుకాదా?"

వాడి కిది తెలియదు.

అమ్మాయివైపు చూశాను - అవు నన్నట్లు తలూపింది.

"ఇలా రా-" దగ్గరికి పిలిచాను. మా వాడు సంతోషంగా చూస్తున్నాడు. 'చూడు మా నాన్న ఎంత మంచివాడో!' అన్నట్లు.

ఆ అమ్మాయి దగ్గరి కొచ్చింది.

"నీ పేరేమిటమ్మా?"

"పావణి."

అమ్మాయి ముఖంలో నాకు తెలిసిన ఛాయలు ఏమైనా కనిపిస్తాయేమోనని పరీక్షగా చూశాను.

చక్రపాణిగారంటే పార్వతి భర్త.

'పావణి' పార్వతి కూతురు - యీ ఊళ్ళోనే వుంటున్నారు.

రాజు మంచినీ ళ్ళిచ్చాడు పావణికి.

"మళ్ళీ ఆడుకుంటాం నాన్నా!" అని వీధిలోకి పరుగెత్తాడు పావణితో.

"ఒరేయ్" పిలిచినా వినకుండా వెళ్ళి పోయాడు రాజు.

"వినపడలేదేమో!"

చిన్నప్పుడు తనకూ వినిపించేదికాదు- నాన్నగారు పిలుస్తుంటే. ఒకవేళ విని పిస్తే కండ్లు చెరువులయ్యేయి. పార్వతిని వదలిపెట్టడం అంత యిష్టంగా వుండేది కాదు. యిప్పుడు వీడికీ యింతేనేమొ.

ఎంతయినా రక్తసంబంధం. తన లాగే జీవికను నడుపుతాడేమోనన్న వెర్రిశంక ఒకటి ఆవహిస్తూంది.

కొడుకును కన్నాంగాని కర్మను కన్నామా? కర్మను ఒక మార్గాన నడి పిస్తే? కొడుకు శ్రేయస్సును అభిల షించే తనకూ యీ భావా లుండటం అభినందనీయమే. మరిప్పుడు త నేం చేయాలి?

రాజును వెనక్కు పిలిచి పావణితో ఆడుకోవడం మానెయ్యమని చెప్పాలి.

అలా అనుకున్నాను. కాని మరో అనుమానం.. ఆ విధంగా చేస్తే 'నాన్న అలా ఎందుకంటున్నాడో' అనుకుని వాడి స్నేహం మరీ వృద్ధికావచ్చు. వాడి కీ భావన రాకుండానే మార్చాలి.

మార్పు అవసరం.

మళ్ళీ అనిపిస్తూంది. అవసరంలేని మార్పు కాదుగదా యిది?

రాజు 'ఫలితాన్ని' నేను కండ్లచూస్తా నని అనుకోను. ఎందుకంటే పరిస్థితులు చివరికి యిలా మనకోసం రావు.

ఏమీ అర్థంకాలేదు.

నా దృష్టిలో పావణి పెరిగి పెద్ద దయింది.

రాజు ఇంకా ఎప్పటిలాగానే వున్నాడు. వాడు పెరిగినట్లుగా ఊహించ లేకపోయాను.

"రాజు..."

"రాజుకోసం నేనేం చేయగల తండ్రిని?"